క్లుప్తంగా

క్షీరాభిషేకం



కన్నాయిగూడెం: దివ్యాంగులకు రూ.4016 పింఛన్ అందిస్తున్నందుకు దివ్యాంగుల మండల అధ్యక్షుడు జనగాం భాస్కర్ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి గురువారం మండల కేంద్రంలో క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనువాస్, రజిత, అకిలేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



వాజేడు: సైబర్ నేరాలు పెరుగుతున్న క్రమంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వాజేడు ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల పరిధిలోని చింతూరు గ్రామంలో గురువారం గ్రామస్తులతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరాలతో చాలా ప్రమాదం ఉందని జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గండ్ర గెలుపునకు ఇంటింటా ప్రచారం

టేకుమట్ల(రేగొండ): భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మళ్లీ ఎమ్మెల్యేగా గెలవాలని ఇంటింటా సర్వే, ప్రచారం చేస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్ తెలిపారు. గురువారం మండలంలోని పోనగండ్ల గ్రామంలో వాడవాడ తిరుగుతూ బీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో అధిక మెజార్టీతో గండ్ర వెంకటరమణారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాకర్ల సర్పంచ్ కుసుంబ రంజిత్, సర్పంచ్ సుమలత–భాస్కర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రం తిరుపతి, నాయకులు లింగయ్య, కుమారస్వామి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

చిట్యాల: వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాలకుర్తి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని గోపాలపురం గ్రామ శివారులోని పంట పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. గత నెలలో కురిసిన భారీ వర్షాల మూలంగా భూపాలపల్లి మండలం కొత్తపల్లి (ఎస్‌ఎం) గ్రామ శివారులోని దోమర్ల చెరువు గండ్లు పడడంతో గోపాలపురం శివారులోని రైతులకు చెందిన పంట పొలాలు పూర్తిగా బీడుగా మారాయని అన్నారు. దీంతో పంటలు పండే పరిస్థితి లేదని తెలిపారు. రైతులకు చెందిన రెండు వేల ఎకరాల విస్తీర్ణం మొత్తం ఏడారిగా మారిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మానవహక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా సభ్యులు కర్ణాటకపు సమ్మయ్య, రైతులు మూల శంకర్‌గౌడ్, నర్సయ్య, పోచయ్య, రఘుపతి, శాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం



ఏటూరునాగారం: చెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఎస్‌ఎస్ తాడ్వాయి: చెక్కు అందజేస్తున్న ఎంపీపీ వాణిశ్రీ

ఏటూరునాగారం: పేదల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏటూరునాగారం మండలానికి మంజూరు అయిన 13 మంది లబ్ధిదారులకు బీసీ బంధు చెక్కులను ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న బీసీ బంధును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని అత్యధిక ఓట్లతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి లక్ష్మణ్, ఎంపీడీఓ కుమార్, ఎంపీటీసీ కుమ్మరి స్వప్న, బీఆర్‌ఎస్ నాయకులు కూనూరు మహేష్, కొండాయి చిన్ని, ఖాజాపాషా, ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ ఉమారాణి పాల్గొన్నారు. అలాగే కన్నాయిగూడెం మండలంలోని 10 మంది లబ్ధిదారులకు బీసీ బంధు చెక్కులను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చిన్ని కృష్ణ, ఎంపీటీసీ స్వప్నలతో కలిసి అందజేశారు.

ఎస్‌ఎస్ తాడ్వాయి: కుల వృత్తులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం బీసీ బంధు పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీపీ గొంది వాణిశ్రీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 25 మంది లబ్ధిదారులు బీసీ బంధు చెక్కులను ఎంపీపీ వాణిశ్రీ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేతి, కుల వృత్తులను ఆదుకోవడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. ఒకరిపై ఆధార పడకుండా సొంతంగా ఎదగాలనే లక్ష్యంతో సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, ఎంపీటీసీ శ్రీను, సర్పంచ్ బాబురావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ



ములుగు రూరల్: చెక్కు అందజేస్తున్న నాగజ్యోతి

ములుగు రూరల్: భారీ వర్షాల కారణంగా గోవిందరావుపేట మండలంలోని ప్రాజెక్టు నగర్‌లో వరదలతో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం అందించిన రూ.15 లక్షల విలువ చేసే చెక్కులను బాధిత కుటుంబాలకు జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ సూడి శ్రీనివాస్, జెడ్పీటీసీ హరిబాబు, ఆత్మచైర్మన్ చక్రపాణి, సాయిబాబా, బాబర్, స్వరూప, శ్రీనివాస్, మోహన్‌రాథోడ్ పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండలంలోని దొడ్ల, మల్యాల గ్రామాల్లోని గిరిజన వరద బాధితులకు 52 మందికి ఒక్కొక్కరికీ రూ.5వేల చొప్పున అందజేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ నితీష్, ఆర్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండలంలోని మల్యాల, దొడ్ల ప్రజలకు చెక్కులను అందజేశామన్నారు. ఐటీడీఏ పీఓ అంకిత్ ఆదేశాల మేరకు అందించినటుల వెల్లడించారు.



ఏటూరునాగారం: చెక్కు అందజేస్తున్న డీటీ నితీష్, ఆర్ఐ శ్రీనివాస్

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మంగపేట: నియోజకవర్గ అభివృద్ధికి తన తండ్రి అజ్మీరా చందూలాల్, తాను ఎంతో కృషి చేసినట్లు ములుగు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజ్మీరా ప్రహ్లాద్ తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ టికెట్ దక్కకపోవడంతో భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై గురువారం కమలాపురంలోని పార్టీ నాయకుడు రాణాప్రతాప్‌రెడ్డి ఇంట్లో మాజీ జెడ్పీటీసీ వైకుంఠం, పచ్చా శేషగిరిరావు ఆధ్వర్యంలో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తన తండ్రి దివంగత మాజీ మంత్రి చందూలాల్ 40 సంవత్సరాలుగా నియోజకవర్గ అభివృద్ధిలో ప్రత్యేకతను చాటుకుని ప్రజల మన్ననలు పొందారన్నారు. కార్యకర్తల అభీష్టం మేరకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తారని ఆశించిన తనకు సీఎం కేసీఆర్ టికెట్ ఇవ్వకపోవడం బాధాకరంగా ఉందన్నారు. రాజకీయ భవిష్యత్‌పై కార్యకర్తల అభిప్రాయం మేరకు ముందుకు సాగుతానన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు సామా మోహన్‌రెడ్డి, దూళిపాల సుబ్బారావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, చిలకమర్రి లక్ష్మయ్య, వాసుదేవ మూర్తి, అఫ్జల్, దేగల ఆదినారాయణ, పసుపులేటి సుబ్బారావు, ఆళ్ల రాణి, లింగమ్మ పాల్గొన్నారు.

చేయూత

ఏటూరునాగారం: హైదరాబాద్‌కు చెందిన ఎస్‌కే ఫౌండేషన్ నిర్వాహకులు గురువారం మండలంలోని కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాల వరద బాధితులకు నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రిలను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రెసిడెంట్ నోబుల్ రాజు మాట్లాడుతూ.. వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సాయం చేశామని, ఎమ్మెల్యే సీతక్క వరద బాధితులకు కావాలిస్సిన వస్తువల వివరాలు చెప్పడంతో వాటిని బాధితులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రాజశేఖర్, కోశాధికారి మురళికృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వావిలాల ఎల్లయ్య, గుడ్ల దేవేందర్ పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కారుతో ప్రయోజనాలు

మొగుళ్లపల్లి: డబుల్ ఇంజిన్ సర్కారు వస్తే రాష్ట్రానికి చాలా ప్రయోజనాలు ఉంటాయని గోవా రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే ఉల్హాస్ తుయేంకర్ అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని అమ్మగార్డెన్‌లో ఏర్పాటు చేసిన బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాలు ఉండటంతో అనేక పథకాల అమలు సాధ్యమవుతాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలను ఏవిధంగా మోసం చేస్తోందో నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి వివరించాలన్నారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. మహిళలు, వారి సంక్షేమంపై కేసీఆర్ కుటుంబానికి చిత్తశుద్ధి లేదన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యపాల్‌రెడ్డి, చదువు రాంచంద్రారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోరె రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చెవ్వ శేషగిరి పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

మల్హర్: సీఎం కేసీఆర్ చేతుల మీదుగా స్పెషల్ అవార్డు అందుకున్న కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేష్‌ను బీఆర్‌ఎస్ మండల అధికార ప్రతినిధి, కాళేశ్వర దేవస్థాన డైరెక్టర్ బండి రాజయ్య పోలీస్ స్టేషన్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నార రమేష్, వేల్పుల శేఖర్, ఆదివాసీ తుడుందెబ్బ నాయకపోడ్ సీనియర్ నాయకుడు గుంటి బాపు తదితరులు పాల్గొన్నారు.

మరికాల ఇసుక రీచ్‌లో అక్రమాలు



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

వెంకటాపురం(కె): మరికాల ఇసుక రీచ్‌లో అక్రమాలు జరుగుతున్నాయని అక్రమాలు చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ లక్ష్మీనగరం గ్రామస్తులు తహసీల్దార్ నెల్లుట్ల సృజన్ కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మరికాల పంచాయతీ లక్ష్మీనగరం గ్రామంలో 98 గిరిజన కుటుంబాల వారు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నామన్నారు. తమకు ప్రభుత్వం ఇసుక రీచ్‌ను మంజూరు చేసిందని అన్నారు. కాగా ఇసుకరీచ్ సొసైటీ సభ్యులు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇసుక రీచ్‌లో లారీ లోడింగ్ చేసినందుకు లారీ డ్రైవర్ రూ.900 చెల్లిస్తే సొసైటీ సభ్యులు పంచాయతీ అభివృద్ధి, గుడి నిర్మాణం ఇతర ఖర్చుల పేరుతో రూ.300 కటింగ్ చేసుకొని రూ.600 చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక రీచ్‌లో జరిగిన అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోండి

వాజేడు/వెంకటాపురం(కె): 18 సంవత్సరాల వయస్సు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని వాజేడు వెంకటాపురం(కె) తహసీల్దార్లు శ్రీనివాస్, సృజన్ కుమార్ గురువారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, 27న మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలకు లేదా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వొచ్చని తెలిపారు.

మెడికల్ సీట్లు సాధించిన పేద విద్యార్థులు

- వెంటాడుతున్న ఆర్థిక కష్టాలు
- దాతల సాయం కోసం ఎదురు చూపు



తల్లి హసీనాతో తాహేర్ షరీఫ్

ఏటూరునాగారం: టైలర్ పని చేసుకుంటూ కొడుకును చదివించగా నీట్‌లో స్టేట్ 497 ర్యాంక్ సాధించి ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటును దక్కించుకున్నాడు. వివరాల్లోకి ఇలా ఉన్నాయి.. ఏటూరునాగారం మండల కేంద్రంలోని తాళ్లగడ్డకు మహ్మద్ హసీనా, హుస్సేన్ దంపతుల కుమారుడు మహ్మద్ తాహేర్ నిజామబాద్‌లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాయ్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసుకున్నాడు. ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో ఎంబీబీఎస్ సీటును పొందాడు. కాగా ఈనెల 26వ తేదీలోపు రూ.60వేలు ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు చెల్లించి సీటను ఖరారు చేసుకోవాల్సి ఉంది. కానీ తండ్రి భవన నిర్మాణ కార్మికుడు, తల్లి టైలర్ పని చేస్తూ కుటుంబాన్ని సాకుతుంది. ఈ తరుణంలో ఎంబీబీఎస్ సీటు పొందిన తన కుమారుడికి ఒకేసారి రూ.60వేలు చెల్లించే ఆర్థిక స్తోమత లేదని తల్లి హసీనా వివరించింది. దాయమయులైన ఎవరైనా సాయం చేయాలని తల్లి హసీనా వేడుకుటుంది. దాతలు సాయం చేయలనుకుంటే ఫోన్ పే నంబర్ 9701321129కు చేయవచ్చని తెలిపారు.

మెడికల్ సీట్ సాధించిన నిరుపేద దళిత విద్యార్థి

మంగపేట: అసలే నిరుపేద దళిత కుటుంబం చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి తల్లి కూలి పనికి పోతేగాని పూటగడవని పరిస్థితి. అలాంటి కుటుంబంలో పుట్టి పట్టుదలతో చదివి ఎట్టకేలకు మెడికల్ సీటు సాధిచాడు మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన కావిరి మలయ్య, మాణిక్యమ్మ దంపతుల కుమారుడు కావిరి వరప్రసాద్. వివరాలు ఇలా ఉన్నాయి.. వరప్రసాద్ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. అప్పటి నుంచి తల్లి కూలీపనులకు వెలుతూ వరప్రసాద్‌తో పాటు పెద్ద కుమారైను స్థానిక ప్రభుత్వ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో పదోరతగతి వరకు చదివించింది. తమ కోసం కష్ట పడుతున్న తల్లికి చేదోడు వాదోడుగా చిన్న చిన్న పనులకు వెళ్తూ తిమ్మంటపేలో 2018–2019లో వరప్రసాద్ పదోతరగతి పూర్తి చేశాడు. హైదరాబాద్‌లోని సెంట్రల్‌ఫర్ ఎక్స్‌లెంట్ సోషల్‌వేల్ఫేర్ గౌలిదొడ్డిలో ఫ్రీసీటు సాధించి 2019–2012 వరకు ఇంటర్ పూర్తి చేసి ఇంటర్‌లో 876 మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. సెంట్రల్‌ఫర్ ఎక్సలెంట్ సోషల్ వెల్ఫేర్ గౌలిదొడ్డిలో మెరిట్ స్టుడెంట్స్‌కు ఫ్రీకోచింగ్ ఇవ్వడంతో ఇటీవల నీట్(ఎన్‌ఈఈటీ) రాసిన వరప్రసాద్ ఆలిండియా ర్యాంక్ 1,88506, రాష్ట్ర స్థాయిలో 5414ర్యాంకును సాధించి నీట్ యూజీ మొదటి రౌండ్ కౌన్సిలింగ్‌లో జగిత్యాల మెడికల్ కళాశాలల్లో సీటు సాధించాడు. కాలేజీలో చేరాలంటే అడ్మిషన్ ఫీజు రూ1.50 లక్షలు, నాలుగు సంవత్సరాలకు గాను సంవత్సరానికి రూ 1,12,000 చొప్పున చెల్లించాల్సి ఉంది. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి ఎంతో కష్టపడి చదివి డాక్టర్ చదువుకు సీటు సాధించినా చదువుకునేందుకు అంతపెద్ద మొత్తంలో ఫీజు చెల్లించే స్తోమత లేక తన ఉన్నత చదువులకు దాతలు సహృదయంతో ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని ప్రాధేయపడుతున్నాడు. సాయం చేసే దాతలు ఫోన్ పే నంబర్ 9392378583కు చేయాలని వేడుకున్నారు.



తల్లి మాణిక్యమ్మతో వరప్రసాద్

'బీసీ బంధు'లో అర్హులకు అన్యాయం



ములుగు: మాట్లాడుతున్న చాంద్‌పాషా



ఎస్‌ఎస్ తాడ్వాయి: మాట్లాడుతున్న దేవేందర్



ఏటూరునాగారం: మాట్లాడుతున్న రఘు



మంగపేట: మాట్లాడుతున్న ఆదినారాయణ

ములుగు: బీసీ బంధు పథకం లబ్ధిదారుల ఎంపికలో అర్హులకు అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో బీసీ బంధు ఎంపికలో అధికారులు అవకతవకలకు పాల్పడి అనర్హులకు బీసీబంధు కట్టపెట్టారని ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, బీసీ కార్పొరేషన్ అధికారి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, కొండం రవిందర్, దేవ్‌సింగ్, తిరుపతి, రేవంత్‌యాదవ్, నాగరాజు, శ్యాం, ఓడ రాజు, అనిల్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌తాడ్వాయి: అర్హులైన ప్రతి ఒక్కరికీ బీసీబంధు వర్తింపచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పైరవీల జోక్యంతో అనర్హులను అధికారులు ఎంపిక చేస్తున్నారన్నారు. బీసీ బంధుపై మార్గదర్శకాలను అధికారులు ప్రకటించాలన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు ఎండీ.ముజఫర్ హుస్సేన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, సర్పంచ్‌లు ఇర్ప సునీల్, నరిసింహస్వామి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, సీనియర్ నాయకులు అరెం లచ్చుపటేల్, నాయకులు చక్రపాణి, సాంబయ్య, రాజయ్య, చిరంజీవి, నరేష్, సంజయ్ పాల్గొన్నారు.

ఏటూరునాగారం: బీసీ బంధు బీఆర్‌ఎస్‌నాయకులకే వస్తుందని మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బీసీ బంధు చెక్కులను అందజేస్తుండగా పార్టీ నాయకులతో కలిసి అక్కడికి వెళ్లి బీసీ బంధు చెక్కుల పంపిణీ ఆపాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రానికి చెందిన కొక్కొండ కోటేశ్వర్‌రావు జాబితాలో 8వ పేరు ఉండగా అతడికి ఎందుకు చెక్కు ఇవ్వలేదని ఎంపీడీఓ కుమార్, ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా బుచ్చయ్యను ప్రశ్నించారు. బీసీ బంధు జాబితాల్లో ఉన్న క్రమ సంఖ్యలో పద్ధతిగా ఇవ్వాలని, ఇష్టాను సారంగా ఇవ్వడం ఏమిటన్నారు. దివ్యాంగులై కుల వృత్తులు చేసుకుంటున్న కుటుంబాలకు ఎందుకు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు గుడ్ల దేవేందర్, వావిలాల ఎల్లయ్య, సులేమాన్ నాయకులు పాల్గొన్నారు.

మంగపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన కులవృత్తులు, చేతి వృత్తులను జీవనం సాగించే బీసీలకు మంజూరు చేయాల్సిన బీసీ బంధు పథకాన్ని మండలంలోని అధికార బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మంజూరు చేశారని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ముత్తినేని ఆదినారాయణ ఆరోపించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 1031 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే 37 మందికి మంజూరు చేశారని అదికూడా బిఆర్‌ఎస్ అధికార పార్టీ వారిని ఎంపిక చేశారన్నారు. సమావేశంలో కాంగ్రె పార్టీ మండల అధ్యక్షుడు జయరాంరెడ్డి, యానయ్య, నరేష్, మల్లయ్య, వెంకటేశ్వర్లు, జగన్‌మోహన్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

గొత్తికోయలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న వనవాసి ప్రతినిధులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: వనవాసి కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గూడెంలోని గొత్తికోయలకు దుప్పట్లు, దోమతెరలను గురువారం పంపిణీ చేశారు. మొండ్యాలతోగు, జలగలంచ, కొండపర్తి గూడేలలోని 85 గొత్తికోయ కుటుంబాలకు దుప్పట్లు, దోమతెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అటవీ ప్రాంతంలో నివాసముంటున్న గొత్తికోయలకు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు దోమ తెరలను పంపిణీ చేశామన్నారు. ఆదివాసీ గొత్తికోయలు దోమతెరలను, దుప్పట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘటన మంత్రి నూనె రాజు, డాక్టర్ ముప్ప కృష్ణారావు పాల్గొన్నారు.

తునికాకు బోనస్ ఇప్పించాలని వినతి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

వెంకటాపురం(కె): తమకు తునికాకు బోనస్ డబ్బులు ఇప్పించాలని కోరుతూ అటవీశాఖ కార్యాలయంలో తునికాకు కార్మికులు గురువారం వినతిపత్రం అందజేశారు. 2018 నుంచి 23 వరకు రావాల్సిన బోనస్ సొమ్ములను ప్రభుత్వం మంజూరు చేసిన అధికారులు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైన అధికారులు తమ బోనస్ నగదును ఇప్పించాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గ్యానం వాసు, కట్ల నర్సింహాచారి, నాగమణి, సమ్మక్క, తిరుపతమ్మ తదితరులు ఉన్నారు.